ఓటరు జాబితా క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 29: జిల్లావ్యాప్తంగా ఓటరు జాబితా క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా గురువారం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 15,585 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండగా.. వీటిలో అత్యధికంగా ధర్మవరం నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

హతవిధీ..!

డమ్మీలైన వైసీపీ ప్రజాప్రతినిధులు

- ఇన్‌చార్జి పేరుతో కొత్తవారు
- అనుభవం లేకపోయినా పెత్తనం
- అధికారిక కార్యక్రమాల్లోనూ హవా
- ప్రొటోకాల్ నిబంధనలకు తూట్లు
- ఎంపీ, ఎమ్మెల్యేల్లో అసహనం
- కనిపించకుండా పోయిన వైనం





ఇటీవల అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు శాంత, దీపిక (ఫైల్)



హిందూపురం

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం, అధికార పార్టీ నేతలకు పరోక్షంగా పెత్తనం ఇవ్వడం మొన్నటిదాకా రాష్ట్రంలో చూశాం. వైసీపీ ప్రభుత్వంలో, జగన్ సారథ్యంలో వింత పోకడకు తెరలేపింది. సాక్షాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యేలను పక్కన పెట్టేశారు. స్థానికేతరులు, ఇతర రాష్ట్రాలకు చెందినవారిని ప్రొటోకాల్ కూడా లేనివారికి పెత్తనం ఇచ్చింది. అధికార పార్టీలో ఉండి ఇంకా ఎన్నికలకు సమయం ఉన్నా.. ఎమ్మెల్యేలు, ఎంపీలకు దక్కాల్సిన గౌరవం లభించకుండా చేసింది. నిన్నమొన్నటి వరకు ప్రజా ప్రతినిధులు లేవకనే ఇంటి వద్ద కాపలాగా ఉండి సెల్యూట్ కొట్టి విధులకు హాజరయ్యే అధికారులు సైతం.. ప్రస్తుతం వారి ఫోన్ చేస్తుంటే ఎత్తని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతోపాటు ఒక ఎంపీకి ఇలాంటి అనుభవమే ఎదురవుతోంది. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, ఒక ఎంపీ సొంత నియోజకవర్గాల్లో కనిపించకుండా పోయారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి ఐదేళ్లపాటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే రోజు వరకు నియోజకవర్గానికి కింగ్. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆయనే ప్రజాప్రతినిధి. అలాంటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండి కూడా జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, తనపై ఉన్న ప్రజావ్యతిరేకతను నియోజకవర్గ ప్రజాప్రతినిధులపై నెట్టేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇన్‌చార్జి సిఫార్సుల అనుగుణంగా ఎడాపెడా అధికారులను వాయించేస్తున్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలకు కూడా తెలియకుండా ఇన్‌చార్జిలే అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. తాము చేస్తున్నది తప్పు అనీ, చట్టవ్యతిరేకమని తెలిసినా అధికారులు ఇన్‌చార్జిలకు దాసోహమంటున్నారు.

ఇన్‌చార్జిల పేరుతో స్థానికేతరులు

2019లో వైసీపీ హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మహ్మద్ ఇక్బాల్ పోటీచేసి ఓడిపోయారు. అయినా ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఉన్నా.. ఆయన ఏ అధికారిక కార్యక్రమంలోనూ పాల్గొననీయకుండా, ప్రొటోకాల్ నిబంధనలు సైతం తుంగలో తొక్కి, ఆయన హిందూపురానికి వచ్చినపుడు అధికారులు వెళ్లేందుకు కూడా జంకేవారు. నాలుగేళ్లకుపైగా ఎమ్మెల్సీ అధికారం చెలాయించారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో బెంగళూరులో నివాసముంటున్న దీపికను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. దీంతో ఎమ్మెల్సీ పొరుగు రాష్ట్రానికి పయనమయ్యారు. ఆ తరువాత ఒకటి, రెండు సార్లు హిందూపురానికి వచ్చారు. ఏడు నెలల క్రితం వరకు హిందూపురం నియోజకవర్గంలో ఇక్బాల్ చెప్పిందే వేద వాక్యం. అలాంటిది పరిస్థితులు తల్లకిందులయ్యాయి. ఒకానొకదశలో ఆయన వెంట మూడు పోలీసు జీపులు ఉండేవి. ఎమ్మెల్సీతోపాటు మాజీ ఐజీ కూడా కావడంతో పోలీసులు అత్యుత్సాహం చూపేవారు. అలాంటిది కాలం కలిసిరాక నేడు అదే అధికారులు.. సదరు ప్రజాప్రతినిధి ఫోన్‌చేస్తే ఎత్తని పరిస్థితి నెలకొంది. పెనుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ మొన్నటిదాకా అంతా తానై వ్యవహరించారు. అటెండర్‌తో మొదలుకుని జిల్లాస్థాయి అధికారులకు పోస్టింగ్ వేయించారు, తీయించారు. కళ్యాణదుర్గం నుంచి మంత్రి ఉషశ్రీని దిగుమతి చేసుకోవడంతో శంకర్‌నారాయణ మొన్నటి వరకు ఉన్నా ఆయన తీసుకొచ్చిన అధికారులే ఆయన మాట వినని పరిస్థితి ఏర్పడింది. హిందూపురం ఎంపీ అయిన గోరంట్ల మాధవ్ రెండు నెలల కిత్రం వరకు నియోజకవర్గంలో అంతా తానై వ్యవహరించారు. అలాంటిది ఆయనను కాదని కర్ణాటక నుంచి బీజేపీకి చెందిన శాంతను వైసీపీ హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. దీంతో గోరంట్ల మాధవ్ ఇక్కడికి రావడం మానేశారు. ఆయన మాజీ పోలీసు అధికారి కూడా కావడంతో ఒకప్పుడు ఏ సమస్య వచ్చినా ఆయనను ఆశ్రయించేవారు. అలాంటిది కొన్ని రోజుల క్రితం ఆయన కంటే చిన్న స్థాయిలో పనిచేసే అధికారికి ఫోన్ చేస్తే స్పందించని పరిస్థితి ఎదురైంది. ఇక కదిరి నియోజకవర్గంలో మొన్నటివరకు అన్నీ తానై వ్యవహరించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని మరో వ్యక్తిని సమన్వయకర్తగా నియమించారు. దీంతో ఎమ్మెల్యే కనిపించడం మానేశారు. మడకశిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే తిప్పేస్వామిదీ అదే పరిస్థితి. అక్కడ మరో వ్యక్తిని సమన్వయకర్తగా నియమించారు. దీంతో ఎమ్మెల్యే కనిపించకుండా పోయారు. ఏదైనా సమస్య మీద అధికారులకు ఫోన్‌చేసినా పనిచేయని పరిస్థితి నెలకొందని ఓ ప్రజాప్రతినిధి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో సదరు ప్రజాప్రతినిధి.. సీఎం జగన్‌పైనే పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అసలు ప్రజాస్వామ్యంలో ఇలాంటి బదిలీలు జరుగుతాయని ఎప్పుడూ వినలేదు, కనలేదని, అంతేకాక ప్రజలచేత ఎన్నుకోబడిన ఎంపీల మాటే పక్కనబెట్టి ఏ పదవీ లేని వారి మాట తీసుకుంటున్నారంటే ఇంతకంటే ఘోరం ఏముంటుందని సన్నిహితుల వద్ద వాపోయారు.

ప్రజా సమస్యలపై పోరాడి ఎన్నికల్లో గెలుపొందితే ఆ నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలో, ఎవరిని ఎలా మలుచుకోవాలో తెలుస్తుంది. ఏ అనుభవంలేని, ఈ ప్రాంతంతో సంబంధం లేని వ్యక్తులను తీసుకొచ్చి ప్రజలు, అధికారులపై రుద్దితే వారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరిపాలన అనుభవం లేని పెత్తనంవల్ల వారు ఎలా వ్యవహరిస్తారో తెలియని పరిస్థితి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి

అనుభవంలేని వారికి పెత్తనం

నెలకొంది. హిందూపురంలో సమన్వయకర్తకు పరిపాలనా అనుభవం లేదు. దీంతో కొంతమంది అధికారులు ఆడిందే ఆటగా సాగుతోందన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఫలితంగా పరిపాలన కుంటుపడింది. ఏడు నెలలుగా నియోజకవర్గ అభివృద్ధిపై సంక్షేమ పథకాలు కానీ, నిధులు తీసుకురావడం కానీ జరగలేదు.



మొన్నటి వరకు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగిన అధికారులు వారిస్థానాల్లో వచ్చిన ఇన్‌చార్జిల చుట్టూ తిరుగుతున్నారు. సాధారణంగా ఎన్నికల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ఉంటుంది. ఎలాంటి పదవి లేని వ్యక్తుల చుట్టూ అధికార యంత్రాంగం చక్కర్లు కొట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఒకప్పుడు డీఎస్పీ స్థాయి అధికారి.. మంత్రులకు ప్రొటోకాల్‌గా వెళ్లేవారు. పరిస్థితి తిరగబడింది. ఏ పదవీలేని సమన్వయకర్త ముందువెళ్లి సలాం కొట్టాల్సిన పరిస్థితి దాపురించింది. సమన్వ

ఇన్‌చార్జిల చుట్టూ యంత్రాంగం

యకర్తలకు గన్‌మెన్‌ను కేటాయించడం మరో వింత. కొంతమంది వద్ద ఉన్న గన్‌మెన్ ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటూ సమన్వయకర్తలకు ప్రైవేటు సైన్యంగా పనిచేయడం దురదృష్టకరం. అంతేకాక సమన్వయకర్తల మాటలు వినాలని ఉన్నతాధికారులు వారి వారి శాఖలకు ఆదేశాలు ఇవ్వడం మరీదారుణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ లేకపోయినా దర్జాగా పాల్గొంటున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం మోసం

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్

ధర్మవరం, ఫిబ్రవరి 29: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మోసం చేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ విమర్శించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దుచేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. జీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి ఉపాధ్యాయ, ఉద్యోగులను మరోసారి మోసం చేసిందని మండిపడ్డారు. ఐదేళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల్లో ఏ ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలనీ, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలనీ, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్రారెడ్డి, బలరాముడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రంలో రోల్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పరీక్షలకు వేళాయె..

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు..

హాజరుకానున్న 11,800 మంది..

కొత్తచెరువు, ఫిబ్రవరి 29: పరీక్షాకాలం వచ్చేసింది. ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐఓ సురేశ్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 11,800 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. శుక్రవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. 2 నుంచి 20వతేదీ వరకు ద్వితీయ సంవత్సరం వారికి పరీక్షలు ఉంటాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అరగంట ముందే పరీక్షాకేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. 9 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరని ఆర్ఐఓ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసి వేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షా కేంద్రాల తనిఖీకి చీఫ్ సూపరింటెంట్లు 41 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ ఇద్దరు చొప్పున, డీఓలు 41 మందిని నియమించామన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ద్వారా నిఘా ఉంచుతామన్నారు.

ఆ పరీక్షాకేంద్రం.. చాలా దూరం..

ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పనులు కొనసాగుతుండడంతో ఆ రహదారిని అధికారులు మూసేశారు. ప్రస్తుతం పరీక్షాకేంద్రానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు పట్టణంలోనే వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఆ పరీక్షా కేంద్రాన్ని పట్టణంలోని ఏదైనా కళాశాలలో ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


పరీక్షాకేంద్రంలో సిద్ధంగా ఉంచిన బెంచీలు

ఇన్‌చార్జా.. మజాకా..!

- సొంత లేఔట్‌లో మున్సిపల్ యంత్రాలు
- ప్రారంభోత్సవ పనులకు కార్మికులు సైతం..
- వాహనాలు వెళ్లేందుకు రోడ్డు చదును..
- కార్యాలయానికి పిలిపించి.. అధికారికి ఆదేశాలు
- తెల్లారకనే లేఔట్‌లో పనులు ప్రారంభం


మున్సిపల్ ఎక్స్‌కవేటర్‌తో చెరువులో ట్రాక్టర్‌లోకి మట్టిని వేస్తున్న దృశ్యం

హిందూపురం, ఫిబ్రవరి 29: పట్టణంలో ఎక్కడైనా మట్టి అడ్డంగా ఉందనీ, తొలగించాలని మున్సిపల్ అధికారులకు స్థానికులు విన్నవించుకున్నా పనులు చేసేందుకు నెలలు పడుతుంది. రోడ్డులో గుంత పూడ్చాలని వేడుకున్నా యంత్రాంగం కనికరించదు. అలాంటిది అధికార పార్టీ నాయకుల సొంత స్థలాల్లో మాత్రం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు వాలిపోయి, అధికారులు పనులు చక్కదిద్దుతున్నారు. హిందూపురం పట్టణ సమీపాన పూలకుంట పంచాయతీ పరిధిలో వైసీపీ సమన్వయకర్త భర్తతోపాటు నియోజకవర్గంలో అన్నీ తానై చూసే మరో ముఖ్యనేత కలిసి లేఔట్ వేశారు. ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. దీంతో లేఔట్ వద్ద చదును చేయాల్సి వచ్చింది. అధికారం ఉంది కదా అని బుధవారం సాయంత్రం మున్సిపాలిటీకి చెందిన ముఖ్య అధికారిని పిలిపించుకొని ఎక్స్‌కవేటర్, డోజర్ యంత్రాలను పంపాలని ఆదేశించారు. తనకు ఇబ్బంది లేకుండా వాహనాలను తీసుకెళ్లాలనీ, తేడా వస్తే మీరే చూసుకోవాలంటూ చెప్పినట్లు సమాచారం. అవన్నీ తెలీదనీ, పంపాల్సిందేనంటూ వైసీపీ నేత హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఆయన వెంట ఉన్న మరో అధికారి అత్యుత్సాహం చూపి పంపిద్దాం లే అంటూ ముఖ్య అధికారికి సలహా ఇచ్చాడు. దాంతో అప్పటికప్పుడే ఆపరేటర్లకు ఫోన్ చేసి, తెల్లారకనే లేఔట్‌లోకి వెళ్లాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు గురువారం తెల్లవారుజామున అక్కడికి రెండు వాహనాలు వెళ్లి సాయంత్రం 3 గంటల వరకు పనులు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా సదరు లేఔట్‌లోకి చెరువు మట్టిని ఎక్స్‌కవేటర్ సాయంతో తరలించారు. పులమతి రోడ్డు ఇరుగ్గా ఉండటంతో గంగమ్మ గుడి వద్ద నుంచి లేఔట్ వరకు రోడ్డుకిరువైపులా మట్టి వేసి చదును చేశారు. లేఔట్ ప్రారంభోత్సవానికి వెళ్లే వారి కోసం మట్టిరోడ్డును వెడల్పు చేశారు. అంతేనా.. మున్సిపాలిటీలో పనులు చేపట్టే కాంట్రాక్టర్లు కొన్ని ట్రాక్టర్లను ఉచితంగా పంపినట్లు తెలిసింది. ప్రారంభోత్సవ పనుల్లో మున్సిపల్ కార్మికులను కూడా వినియోగించినట్లు సమాచారం. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. విషయం తనకు తెలీదనీ, ఆధారాలిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం మరో విశేషం. వారు చేపట్టిన పనులకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ఉండే వాట్సాప్ గ్రూపుల్లోనే సదరు ఫొటోలు వచ్చినా ముఖ్యనేతల వద్ద వాహనాలు పంపడానికి అంగీకరించిన ఆయన ఆధారాలు చూపితే చర్యలు తీసుకుంటామని చెప్పడం గమనార్హం. లేఔట్ ప్రారంభోత్సవానికి వెళ్లిన అధికార పార్టీ నాయకులే అక్కడ పనుల్లో ఉపయోగిస్తున్న మున్సిపల్ యంత్రాలను చూసి నివ్వెరపోయారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.


రోడ్డు పక్కన చదును చేస్తున్న మున్సిపల్ డోజర్

వందనంతో వల

ఎన్నికల వేళ వలంటీర్లకు తాయిలాలు
మూడు నెలలు ముందే ప్రోత్సాహకాలు
నగదు మొత్తం పెంచి పంపిణీ
అనుకూలంగా మలుచుకునేందుకు వైసీపీ కుయుక్తులు

ధర్మవరం, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వంపై అన్నివర్గాల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఉద్యోగవర్గాల్లో పీకల్లోతు కోపం ఉంది. వారికి రావాల్సిన బకాయిలను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించకుండా చెడుగుడు ఆడుకుంటోంది. వలంటీర్లతో గొడ్డు కష్టం చేయించుకుంటూ గౌరవ వేతనం అంటూ వారి జీవితాలతో ఆటలాడుకుంటోంది. సీఎం జగన్ తీసుకొచ్చినా వ్యవస్థే అయినా.. ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన వలంటీర్లు ఇటీవల తిరగబడటం ప్రారంభించారు. గౌరవ వేతనం పెంచాలంటూ ఉద్యమం చేశారు. నాడు వారి డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం.. ఎన్నికల వేళ ప్రోత్సాహక తాయిళాలతో వలంటీర్లపై వల వేస్తోంది. ఎన్నికలకు ముందు వారిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అనేక కుయుక్తులు పన్నుతోంది. మే నెలలో ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను మూడు నెలలు ముందుగానే అందజేస్తోంది. దారుణంగా ఉన్న రోడ్లను పట్టించుకోరు, బిల్లులు అందక ఆగిపోయిన సచివాలయ భవనాలు, ఆస్పత్రుల నిర్మాణం, ప్రభుత్వోద్యోగులకు బకాయిలు చెల్లించరు. ఆఖరుకు పేదలకు వైద్యం అందించే ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా జమచేయరు. షెడ్యూల్ కన్నా మూడు నెలల ముందు ఎన్నికల ముంగిట వలంటీర్లకు మాత్రం వందనం పేరుతో భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. ఈ తంతు చూస్తున్న ఉద్యోగులు, సామాన్యులు.. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

ప్రోత్సాహక నగదు పెంపు

ఎన్నికల నేపథ్యంలో ప్రోత్సాహకాలు అందుకునే వలంటీర్ల సంఖ్య, అందజేసే నగదు మొత్తం పెరిగింది. జిల్లాలో మొత్తం 544 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో పనిచేస్తున్న దాదాపు అందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం కింద గతేడాది మే నెలలో జిల్లాలోని మొత్తం 8490 మంది వలంటీర్లకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. వీరిలో 8263 మందికి సేవామిత్ర, 193 మందికి సేవారత్న, 34 మందికి సేవా వజ్ర అవార్డులు ఇచ్చారు. గతేడాది సేవామిత్రకు రూ.10వేలు, సేవారత్నకు రూ.20వేలు, సేవావజ్రకు రూ.30వేలు చొప్పున అందజేశారు. ప్రస్తుతం జిల్లాలో 9343 మంది వలంటీర్లకు ప్రోత్సాహకాలు అందజేశారు. అందులో సేవామిత్ర 9125 మందికి, సేవారత్న 187 మందికి, సేవావజ్ర 31 మందికి ఇచ్చారు. ప్రస్తుతం సేవామిత్రకు రూ.15వేలు, సేవారత్నకు రూ.30వేలు, సేవా వజ్రకు రూ.45వేలు చొప్పున అందజేశారు.

వలంటీర్లకు బ్రెయిన్ వాష్

భారీ కార్యక్రమం ఏర్పాటుచేసి వలంటీర్లకు ప్రోత్సాహకాలను అందజేశారు. మండలాలు, డివిజన్లు, నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో వలంటీర్ల బ్రెయిన్ వాష్ చేసినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులే కాకుండా అనేకమంది వేదికలపై ప్రసంగించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు పనిచేసేలా భారీ కుట్రలు పన్నుతున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వేరుశనగకు వైరస్

నిలువునా ఎండుతున్న పైరు



వైరస్ సోకి ఎండిపోయిన వేరుశనగ మొక్కలు

రాప్తాడు, ఫిబ్రవరి 29: రబీలో సాగుచేసిన వేరుశనగను వైరస్ వెంటాడుతోంది. పంట నిలువునా ఎండిపోతోంది. రాప్తాడు మండలంలో బోరు బావుల కింద నవంబరు, డిసెంబరు నెలల్లో వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. రాప్తాడు, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, మరూరు, బండమీదపల్లి, యర్రగుంట, గాండ్లపర్తి, కొత్తపల్లి, పాలచెర్ల, బోగినేపల్లి తదితర గ్రామాల్లో రబీ కింద వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. వేరుశనగ సాగు చేశారు. కే-6, ట్యాగ్, 1694, 1218 రకాల విత్తనం వేశారు. కొన్ని రకాలకు విత్తిన నెల రోజుల నుంచి వైరస్ సోకడం మొదలైంది. విత్తన శుద్ధి మందు కలిపినా ప్రయోజనం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పొలాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి, పంటను కాపాడుకునే మార్గం చూపించాలని కోరుతున్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

నల్లమాడ, ఫిబ్రవరి 29: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయిలు సెల్వరాజ్, చంద్రిన్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ అనంతపురం సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ఓ క్వారీలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సెల్వరాజ్, చంద్రిన్ పనిచేస్తుండేవారు. 2022 మే 15న ఓ బాలిక పొలంలో గడ్డి కోస్తుండగా సెల్వరాజ్, చంద్రిన్ లైంగిక దాడికి యత్నించారు. అప్పట్లో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏడుగురు సాక్షులను విచారించిన సెషన్స్ కోర్టు న్యాయాధికారి.. నిందితులను నేరస్థులుగా పరిగణిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.2 లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లించాలని ఆదేశించారని ఎస్ఐ పేర్కొన్నారు.

అధికారమా.. మజాకా..

వెలుగు కార్యాలయంలో వైసీపీ సమీక్ష
చోద్యం చూసిన అధికారులు

నల్లచెరువు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఆ పార్టీ కార్యకర్తల సమీక్ష సమావేశం జరగడమే ఇందుకు నిదర్శనం. వైసీపీ నాయకులు అధికారమా... మజాకా అన్న చందంగా వెలుగు కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ నెల 3వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన ఉండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై వెలుగు కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యాలయంలోని ఓ గదిలో అధికారులు విధులు నిర్వహిస్తున్నా.. అదేదీ పట్టనట్టు వైసీపీ వారు అక్కడే సమీక్ష జరపడం గమనార్హం. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బుల్‌బాషా, నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, దశరథరామయ్యనాయుడు, విశ్వనాథ్‌రెడ్డి, హైదర్‌వలి, గోపాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డిలు సభావేదికపై కూర్చొని కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ విషయంపై ఏపీఎం రమణమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రిపరేషన్ ప్లాన్‌కోసం కార్యాలయం కావాలని వైసీపీ నాయకులు అడిగారని, దీంతో వెలుగు కార్యాలయం ఇచ్చామని పేర్కొన్నారు.

వైసీపీ సమావేశంలో ఉపాధ్యాయుడు



వైసీపీ సమావేశంలో పాల్గొన్న సుకుమార్ రెడ్డి (వృతంలో..)

తనకల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని బొంతపల్లికి చెందిన సుకుమార్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కదిరి మండలంలోని పట్నంలో గల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నాడు. తనకల్లులోని మండ్లిపల్లి మిట్ట వద్ద గల ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన వైసీపీ సమావేశంలో ఉపాధ్యాయుడు సుకుమార్ రెడ్డి పాల్గొన్నాడు. ఏకంగా వేదికపై ఆశీనులయ్యాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడై ఉండి ఇలా పార్టీ సమావేశంలో పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మర్యాద కావాలి..!

రోడ్డెక్కిన జడ్పీ పాలకవర్గం

- జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తీరుపై ఆగ్రహం
- స్టాండింగ్ కమిటీ సమావేశాల బహిష్కరణ
- సీఈఓకు వ్యతిరేకంగా ఆవరణలో నినాదాలు
- సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ గిరిజమ్మ నిరసన
- జడ్పీటీసీలకు గౌరవం ఇవ్వలేదని మండిపాటు
- తీర్మానాలు అమలు కావడం లేదని అసంతృప్తి



సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు, చైర్ పర్సన్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 29: జిల్లా పరిషత్‌లో అధికారులు, పాలకవర్గం మధ్య విభేదాలు తారస్థాయికిచేరాయి. ఉమ్మడి జిల్లా పరిషత్ పాలకవర్గ సభ్యులు జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తీరుకు నిరసనగా రోడ్డుపైకి వచ్చారు. అధికార పార్టీకే చెందిన వీరు.. గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతోపాటు 30 మంది వరకూ జడ్పీటీసీలు ఆందోళనకు దిగారు. ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గంటన్నర ఆలస్యంగా, మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభమైంది. ఆ వెంటనే గుడిబండ జడ్పీటీసీ భూతరాజు మీటింగ్ హాల్‌లో కింద కూర్చొని నిరసనకు దిగారు.

బైఠాయించిన జడ్పీటీసీలు

జడ్పీటీసీలకు డిప్యూటీ సీఈఓ లలితా బాయి, సీఈఓ నిదియా దేవి ఏమాత్రం గౌరవం, మర్యాద ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు మద్దతుగా జడ్పీటీసీలు తేజశ్విని, మమత, అశ్విని, శీన, హసీనా, కవిత, మహేష్, జయరాం తదితరులు కింద కూర్చుని, అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు. నాలుగు రోజుల క్రితం జడ్పీటీసీ భూతరాజు సీఈఓ చాంబర్‌లోకి వెళితే.. 'యూజ్‌లెస్ ఫెలో..' అని దూషించారని, 'కాల్ ద పోలీస్' అని సిబ్బందికి పురమాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులన్న మర్యాద కూడా ఆమెకు లేదా అని నిలదీశారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు అమలు చేయడం లేదని, తీర్మానం కాపీలను సైతం మాయంచేశారని అన్నారు. 'త్వరలో ఎన్నికలు వస్తున్నాయి. తాగునీటి పనుల కోసం ఇచ్చిన ప్రతిపాదనల ఫైళ్లకు ఆమోదం తెలుపకుంటే ఎలా..?' అని జడ్పీటీసీలు సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయకుండా ప్రజల్లోకి వెళితే తన్నేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, పనుల విషయంలో వెళితే డిప్యూటీ సీఈఓ లలితా బాయి గంటల తరబడి వేచి చూసేలా చేస్తారని అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాజీనామా చేస్తామని అన్నారు.

గౌరవం కోసం..

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ వారించినా సభ్యులు వినుకోలేదు. జడ్పీ సీఈఓ నిదియా దేవి వివరణ ఇవ్వబోయినా సభ్యులు పట్టించుకోలేదు. ఆ తరువాత జడ్పీటీసీలకు మద్దతుగా చైర్‌పర్సన్ సైతం గళం వినిపించారు. జడ్పీ గత సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను అమలు చేయాలని, సభ్యులకు మర్యాద ఇవ్వాలని జడ్పీటీసీల తరపున సీఈఓను కోరారు. ఈ విషయాలను సీఈఓ నిదియా దేవికి ఇంగ్లీష్‌లో అనువదించి చెప్పాలని డిప్యూటీ సీఈఓను కోరారు. దీంతో డిప్యూటీ సీఈఓ 'నువ్వే అనువదించు..' అన్నారు. ఆమె తీరుపై జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు మీకు పనిమనుషుల్లా కనిపిస్తున్నారా..? ఏకవచనంతో ఎలా మాట్లాడుతారు..?' అని మండిపడ్డారు. ఇలాంటి డిప్యూటీ సీఈఓ తమకు వద్దే వద్దు అని అన్నారు. 'ఇక్కడ గౌరవం దక్కనప్పుడు, తీర్మానాలు అమలు చేయనప్పుడు సభ ఎందుకు..? సమావేశాలు ఎందుకు..?' అని చైర్‌పర్సన్ గిరిజమ్మ మండిపడ్డారు. డిప్యూటీ సీఈఓ లలితాబాయిని రెండు రోజుల్లో ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సభ్యులతో కలసి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఆ వెంటనే సీఈఓ కూడా విసురుగా వెళ్లిపోయారు.



సభ్యులతో కలిసి వాకౌట్ చేస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ

సీఈఓకు వ్యతిరేక నినాదాలు

జడ్పీ కార్యాలయ ఆవరణలో జడ్పీటీసీలు, చైర్‌పర్సన్.. 'సీఈఓ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. జడ్పీలో తొమ్మిది నెలల నుంచి సభ్యులకు అవమానం జరుగుతోందని వారు అన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని, స్పందించకుంటే ముఖ్యమంత్రిని కలుస్తామని జడ్పీటీసీలు అన్నారు. జడ్పీలో అధికార పార్టీ సభ్యులు సుమారు గంట పాటు నిరసన తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పాలకవర్గం సైతం అధికార పార్టీవారిదే. వారే అధికారులకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగడం, చైర్‌పర్సన్ గొంతు కలపడం చర్చనీయాంశం అయ్యింది. కాగా, కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన జడ్పీటీసీలను సాయంత్రం వరకూ అనుమతి లభించలేదు. కలెక్టర్ నుంచి స్పందన రాకుంటే సీఎంను కలవాలని సభ్యులు నిర్ణయించుకున్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో బైఠాయించిన జడ్పీటీసీలు

వీడు మావాడే..!

నవజాత శిశువును ఎవరో ఆస్పత్రిలో వదిలి వెళ్లారు
దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు..

లోకం ఎరుగని పసివాడు..
పుట్టి కొన్ని గంటలయ్యుండొచ్చు..
అనారోగ్యంతో బాధపడుతుంటే..
ఎవరో వచ్చి ఆస్పత్రిలో చేర్చారు..
చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారు..
ఆస్పత్రి సిబ్బంది ఆరా తీస్తుంటే..
'వీడు మావాడే.. ఇచ్చేయండి..' అని..
ఎంతో మంది ఎగబడుతున్నారు..
కొందరు గొడవకు దిగుతున్నారు..!
కన్నవారికి దూరమైన ఈ బుడ్డోడు..
దురదృష్టవంతుడా..?
ఏ సంబంధం లేకున్నా..
'మా వాడే..' అని వస్తున్న
ఎందరినో సంపాదించుకున్న అదృష్టవంతుడా..?



వెంటిలేటర్‌పై ఉన్న పసికందు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన పసికందును వదిలేసి వెళ్లారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అప్పుడే పుట్టిన మగబిడ్డతో ఆస్పత్రికి వచ్చారు. బిడ్డ ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉండడంతో తీసుకొచ్చామని వైద్యులకు తెలిపారు. డ్యూటీలో ఉన్న వైద్యురాలు డా.కీర్తి పసికందును పరిశీలించి, ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నందున వెంటనే వెంటిలేటర్ వార్డుకు పంపించారు. పసికందుకు ప్యాడ్ తదితరాలు తేవాలని పసికందును తీసుకొచ్చిన వారికి చెప్పారు. వారు వచ్చాక వివరాలు తీసుకుందామనుకుని ముందు బిడ్డను అడ్మిట్ చేసుకున్నారు. పసికందును తీసుకొచ్చిన ఇద్దరు తిరిగి రాలేదు. ఎంత సేపటికీ వారు రాకపోవడంతో సిబ్బంది.. సెక్యూరిటీతో కలిసి ఆస్పత్రి ప్రాంగణమంతా వెతికారు. అయినా వారు కనిపించలేదు. సిబ్బంది.. సూపరింటెండెంట్‌కు సమాచారం అందించారు. బిడ్డను తీసుకొచ్చిన వారెవరు, కారణాలు ఏమై ఉంటాయి తదితర విషయాలు విచారణలో తేలాల్సి ఉంది. ప్రస్తుతం పసికందు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుస్తోంది. ఆ పసికూనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పసికందును వదిలించుకునేందుకే ఆస్పత్రికి తీసుకొచ్చారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఎవరన్నది వెలుగుచూసే అవకాశం ఉంది. దీనిపై ఐసీడీఎస్ అధికారులకు సమాచారం చేరవేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. వారు సాయంత్రం దాకా రాలేదు.

రోజంతా హైడ్రామా

ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు మగబిడ్డను వదిలి వెళ్లారన్న విషయం ఆనోట.. ఈనోట పడి పట్టణమంతా పాకింది. దీంతో ఆ బిడ్డ తమబిడ్డేనంటూ మధ్యాహ్నం నుంచి పలువురు వచ్చి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి బిడ్డను తీసుకెళ్లేందుకు యత్నించారు. మధ్యాహ్నం ముగ్గురు మైనారిటీ మహిళలు, ఒక పురుషుడు వచ్చి ఆ బిడ్డ తమ బంధువుల బిడ్డేననీ, తామే రాత్రి వదిలి వెళ్లామనీ, తమకు ఇవ్వాలని అడిగారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. రాత్రి బాపూజీనగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఆ బిడ్డ తమ బిడ్డేనంటూ వచ్చారట. తమది తిరుపతి అనీ, కాన్పు కోసం పుట్టింటికి వచ్చాననీ, తనకు తెలియకుండా బిడ్డను తీసుకొచ్చారని చెప్పుకొచ్చారు. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తామనీ, వారు అడిగిన పత్రాలు సమర్పించి తీసుకెళ్లాలనీ, లేకుంటే జైలుకెళ్లారని చెప్పడంతో అక్కడి నుంచి జారుకున్నారు.

స్వయం ఉపాధి
కోర్సులకు శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 29
వివిధ స్వయం ఉపాధి, ఉద్యోగాలకు సంబంధించి ఉచిత కోర్సు ప్రారంభించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 1 నుంచి ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, అనంతరం సర్టిఫికెట్లు, ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామన్నారు. సెల్ఫ్ లెర్నింగ్ సెంటర్‌లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్, కంప్యూటర్ టైపింగ్, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. 20-30 సంవత్సరాలు మధ్య కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బిటెక్ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 73969 50345, 77807 52418ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యాదీవెన సొమ్ము విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29
జగనన్న విద్యాదీవెన సొమ్ము శుక్రవారం విడుదల అవుతుందని ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40,006 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.29.08 కోట్లు జమ అవుతుందని ఆయన వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 29: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ పాఠశాలల కన్వీనర్ సంగీతకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని 15 బీసీ గురుకుల పాఠశాలల్లో 400 మంది బాలురు, 560 మంది బాలికలకు 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. బాలికలకు నార్పల, గోనబావి, డి.హీరేహాళ్, గుడిబండ, బుక్కపట్నం, టేకులోడు, నసనకోట, బాలురకు కొనకొండ్ల, కుందుర్పి, లేపాక్షి, రేగాటిపల్లి, పేరూరు, రొద్దం-1, 2, గుండుమల గురుకుల పాఠశాలల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలని సూచించారు. బీసీ, ఈబీసీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2011 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరాల్లో 3, 4 తరగతులను ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకూడదని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, పాస్ ఫొటో, పుట్టిన తేదీ, కులం వివరాలు, 3, 4 తరగతులు చదివిన పాఠశాలల వివరాలు, తల్లిదండ్రుల రేషన్ కార్డు నంబరు, ఇంటి అడ్రస్ తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచి మార్చి 31వ తేదీ వరకూ https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, అనంతరం ఓ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మేం ఉద్యోగం ఇస్తాం...
జీతం మీరు ఇవ్వండి!

- ఆర్‌అండ్‌బీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో వింత
- రాష్ట్ర వ్యాప్తంగా 467 పోస్టుల భర్తీకి జీవో జారీ
- జీతాల చెల్లింపు బాధ్యత ఎస్ఈలదేనని లింకు
- అతిథిగృహాల ఆదాయంతో చెల్లించాలని మెలిక
- ప్రతినెలా ఏకంగా రూ.70 లక్షల వరకూ భారం
- గెస్ట్‌హౌస్‌లను ఉచితంగా వాడేస్తున్న వీఐపీలు
- జిల్లా కేంద్రాల్లోనే 5 వేలకు మించని ఆదాయం
- చాలాచోట్ల నయాపైసా కూడా రావడం లేదు
- జీతాలు ఎలా చెల్లించాలని ఎస్ఈల ఆవేదన

అనంతపురం సిటీ: ఏటా జాబ్ కేలండర్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలన్నీ భర్తీ చేస్తామన్నారు. పోలీసు ఉద్యోగాలు, మెగా డీఎస్సీ.. అబ్బో ఒకటేమిటి ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అన్నీ మర్చిపోయారు. నాలుగున్నరేళ్ల పాటు ఆ ఊసెత్తకుండా ఎన్నికలు దగ్గర పడటంతో ఇప్పుడు అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు ఇస్తూ హడావుడి చేస్తున్నారు. నిరుద్యోగులను మభ్య పెట్టేందుకు ఒక వింత జీవో జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు భవనాల శాఖ పరిధిలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 467 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. జీతాలు మాత్రం ఆర్‌అండ్‌బీ శాఖ చెల్లిస్తుందని చెప్పకుండా లింకు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం నుంచి కొత్త సిబ్బందికి జీతాలు చెల్లించాలని జీవోలో పేర్కొంది. ఈ బాధ్యతను ఆయా జిల్లాల ఎస్ఈలకు ప్రభుత్వం అప్పగించింది. 'ఉద్యోగాల భర్తీ మా బాధ్యత.. జీతాల చెల్లింపు ఎస్ఈల బాధ్యత' అన్నట్లుగా వ్యవహరిస్తోంది. పోనీ.. కొత్తగా నియమించే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేంత ఆదాయం అతిథిగృహాల నుంచి వస్తుందా.. అంటే అదీ లేదు. వీటికి వచ్చే ఆదాయం చాలా చాలా తక్కువ. చాలా చోట్ల ఒక్కోదానికి నెలకు రూ.3వేలు రావడం లేదు. కొన్నింటికి అసలు ఆదాయమే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జీతాలు ఎక్కడినుంచి చెల్లించాలని ఎస్ఈలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోస్టుల వివరాలు
ఆఫీస్ సబార్డినేట్: 170
వాచ్‌మెన్: 139
శానిటరీ వర్కర్: 158
మొత్తం పోస్టులు: 467
ఒక్కో పోస్టుకు వేతనం: రూ.15,000

ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు
రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉన్నవి: 139
వీటి సగటు ఆదాయం నెలకు: రూ.2,000 లోపు
కొత్తగా జీతాలకు అయ్యే ఖర్చు: రూ.50వేలకు పైగా

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 467 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్తగా వచ్చే ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.15వేలు చొప్పున అతిథి గృహాల ఆదాయం నుంచి జీతంగా ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. అంటే వీరికి జీతాలకు నెలకు రూ.70లక్షల వరకూ ఖర్చవుతుంది. అధికార లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 139 ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కోదాని నుంచి సగటున రూ.50వేలకు పైగా జీతం చెల్లించాల్సి ఉంటుంది. పైసా కూడా ఆదాయం లేని అతిథిగృహాలు ఈ మొత్తాన్ని ఎలా చెల్లిస్తాయో ప్రభుత్వమే చెప్పాలి.

33 వేల దరఖాస్తులు

రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో వాచ్‌మెన్-139, ఆఫీస్ సబార్డినేట్-170, శానిటరీ వర్కర్-158 పోస్టులు మొత్తం 467 ఉన్నాయని, వీటిని అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్టు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ఆయా జిల్లాల్లోని ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాల వారీగా ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 33వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఈ పోస్టులకు విద్యార్హత పదో తరగతి అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నా.. బీటెక్, ఎంటెక్, పీజీ, డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా దరఖాస్తు చేశారు.

ఆదాయం అంతంతే..

రాష్ట్రవ్యాప్తంగా 139 ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు ఉన్నాయి. వీటి నుంచి ఎక్కడా పెద్దగా ఆదాయం లేదని ఎస్ఈలే చెబుతున్నారు. వీటిలో దిగే వీఐపీలు ఎవరూ అద్దె చెల్లించడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జేసీలు వంటి వారు వస్తే.. అద్దె అడిగే సాహసం సిబ్బంది చేయలేకపోతున్నారు. చాలా మంది వీఐపీలు పైసా చెల్లించకుండా అతిథిగృహాలను వాడుకుని దర్జాగా వెళ్లిపోతున్నారు. వారిని డబ్బులు అడిగితే 'అంతే సంగతులు' అని ఉద్యోగులే అంటున్నారు. కొందరు మాత్రం తమ పరిస్థితిని అర్థం చేసుకుని నామమాత్రంగా నగదు చెల్లిస్తారని చెబుతున్నారు. 26 జిల్లాల్లోనూ ఇదే తంతు సాగుతోంది. జిల్లా కేంద్రాల్లో ఉన్న అతిథి గృహాలకు నెలకు రూ.2000 నుంచి రూ.5 వేల వరకు ఆదాయం వస్తోంది. కానీ నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న వాటికి రూ.2వేలు కూడా రావడం లేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం నుంచి కొత్త సిబ్బందికి జీతాలు చెల్లించాలని జీవోలో పేర్కొనడం ఏంటని కొందరు ఎస్ఈలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదెక్కడి జీవో?

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్‌అండ్‌బీలో పరిస్థితి దారుణంగా తయారైంది. చేసిన పనులకు బిల్లులు కావడం లేదు. శాఖాపరంగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఇప్పుడు ఉద్యోగాల భర్తీ పేరిట హడావుడి చేయడం, జీతాల చెల్లింపు బాధ్యతలను ఎస్ఈలపై మోపడం విమర్శలకు తావిస్తోంది. 'ఇప్పటి వరకూ చాలా నోటిఫికేషన్‌లు చూశాం. కానీ ఇలాంటి నోటిఫికేషన్‌ను ఏ ప్రభుత్వమూ విడుదల చేయలేదు' అని పలువురు ఎస్ఈలు వాపోతున్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం గిమ్మిక్కు జీవో జారీ చేసిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాల భర్తీతో పాటు జీతాల చెల్లింపు బాధ్యత కూడా తీసుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

యశోదమ్మ ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, ఫిబ్రవరి 29: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ గురువారం ప్రచారం చేశారు. స్థానిక 22వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. వార్డులో ఆమెకు ఘనస్వాగతం లభించింది. కార్యక్రమంలో నాయకులు పర్వీనాభాను, కౌన్సిలర్ సావిత్రమ్మ, డైమండ్ ఇర్షాన్, ఇనాయత్, షౌకత్, అహ్మద్‌అలీ, బాబ్‌జాన్, ఇస్మాయిల్, నాసిర్, లియాకత్, కాటం మనోజ్, సులేమాన్, మన్సూర్, పవన్, గంగరత్నమ్మ, రమణమ్మ, ఉమాదేవి, ప్రేమలత, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రం వద్ద 144 సెక్షన్

నల్లమాడ, ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని, దీంతో ఆ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నామని ఎస్‌ఐ రమేష్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. పరీక్షాకేంద్రం వద్ద ఎలాంటి అలజడులు జరగకుండా.. పరీక్షలు సజావుగా సాగేందుకు గట్టి బందోబస్తు నిర్వహించనున్నామన్నారు. పరీక్ష జరిగే సమయంలో స్థానికంగా ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆయన సూచించారు.

మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి: పల్లె

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 29: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నాయనకోటలో గురువారం ఆయన పర్యటించారు. అక్కడి కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న అరాచకాలను, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్షతగాత్రుడికి సామకోటి పరామర్శ..

మండలంలోని చెరువుమునెప్పపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త సింహాద్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆ గ్రామానికి వెళ్లి అతడిని పరామర్శించారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

బుక్కపట్నం, ఫిబ్రవరి 29: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగి తమ ఉనికిని చాటుకోవాలని ఆర్యవైశ్య సంఘం రాజకీయ కమిటీ జిల్లా చైర్మన్ పోలేపల్లి ప్రశాంత్ కుమార్ సూచించారు. ఆర్యవైశ్య సంఘం రాజకీయ కమిటీ చైర్మన్‌గా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురువారం ఆయన ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో మొదటసారి రాజకీయ కమిటీ చైర్మన్‌గా తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మెన్ టీజీ వెంకటేష్, గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చిన్నరామసత్యానారాయణ, రాజకీయ కమిటీ రాష్ట్ర చైర్మన్ కోటా సత్యానారాయణకు, మహాసభ కార్యదర్శి తిరువీధుల జగదీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉండి వారు రాజకీయంగా బలోపేతం అవడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

'ఈత వనాన్ని దహనం చేసినవారిని శిక్షించాలి'

బుక్కపట్నం, ఫిబ్రవరి 29: రొద్దం మండలం ఆర్. లోచర్ల గ్రామంలో రెండువందల ఎకరాలకు పైగా ఈతవనాన్ని దగ్ధం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, కల్లుగీత ఫెడరేషన్ కన్వీనర్ తలమర్ల హరిక్రిష్ణగౌడ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీప్రభుత్వం కబ్జాలు, దౌర్జన్యాలకు కేరాఫ్‌గా మారిపోయిందన్నారు. వైసీపీ నాయకులకు కొండలు, గుట్టలు కబ్జాలు చేయడం, రోడ్డుకిరువైపులా ఉన్న వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం పరిపాటిగా మారిందన్నారు. ఈత వనాలను నమ్ముకుని కల్లు గీత కార్మికులు జీవనం సాగిస్తుంటే, వారి కడుపు కొట్టే విధంగా ఈతచెట్లను దగ్ధంచేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. పోలీసులు వెంటనే దుండగులను కఠినంగా శిక్షించాలని అన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అధికారులతో ఆర్డీవో సమీక్ష

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం నియోజకవర్గ అధికారులతో ఆర్డీవో వంశీకృష్ణ సమీక్ష నిర్వహించారు. పోలీసులు, ఎన్నికల అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. సమీక్షలో డీఎస్పీ శ్రీలత, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా శ్రీధర్‌బాబు బాధ్యతలు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా శ్రీధర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ వీఆర్‌కు వెళ్లారు. ఎస్‌ఐ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ధర్మవరం, ఫిబ్రవరి 29: పట్టణంలోని కొత్తపేటలో గల మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకింగ్ క్లబ్ (డీసీవీసీ) ఆధ్వర్యంలో ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. తెలంగాణలోని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మొక్కలు పెంచడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చెట్లతోనే సమస్త జీవరాశుల మనుగడ సాధ్యమన్నారు. అవి అందించే ఆక్సిజన్‌తోనే అన్ని జీవరాశులు జీవిస్తున్నాయని పేర్కొన్నారు. కనుక ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం మొక్కలను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 రాజేశ్వరి, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, హెచ్‌ఎం మేరీ వర కుమారి, డీసీవీసీ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి, అధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

- పరిటాల జ్ఞాన
- ధర్మవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహణ
- పెద్దఎత్తున తరలివచ్చిన తెలుగు మహిళలు


ధర్మవరంలోని శివానగర్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న పరిటాల జ్ఞాన

ధర్మవరం, ఫిబ్రవరి 29: మహిళల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. స్థానిక శివానగర్‌లోని శివాలయంలో స్వామివారికి ఆమె రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమెతో పాటు తెలుగుమహిళలు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలతో కలిగే లబ్ధిని వివరించారు. పరిటాల జ్ఞాన మాట్లాడుతూ.. డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చి, మహిళాభివృద్ధికి బాటలు వేసింది చంద్రబాబునాయుడు అన్నారు. టీడీపీని గెలిపించుకుంటే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మకు వందనం కింద రూ.15వేలు, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తారన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే దిశగా స్టిచ్చింగ్ యూనిట్లను పరిటాల శ్రీరామ్.. ధర్మవరానికి తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు ముతుకూరు బీబీ, పద్మావతి, బాను, స్వర్ణకుమారి, మున్నీ, చౌడమ్మ, కత్తుల సునీత, శారద, వెంకటలక్ష్మి, ప్యారిమా, టీడీపీ నాయకులు ఎల్ నరేంద్రచౌదరి, ఫణికుమార్, మహేశ్ చౌదరి, బీరే గోపాలక్రిష్ణ, కాచర్ల కంచన్న, కేశగాళ్ల శీనా, పల్లపు రవీంద్ర పాల్గొన్నారు.

పట్టణంలోని 5వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలకృష్ణ తదితరులు పార్టీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ వాటిలోని పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ చేనేతల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేనేతలకు అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి అందరికీ అందేలా చూసిందన్నారు. ప్రస్తుత జగన్ ప్రభుత్వం ఆ పథకాలన్నీ రద్దు చేసి.. కేవలం నేతన్న నేస్తం కింద రూ.24వేలు మాత్రమే అందిస్తోందని దుయ్యబట్టారు. అది కూడా వైసీపీకి అనుకూలంగా ఉండేవారికి మాత్రమే వస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే రద్దయిన పథకాలన్నీ తిరిగి ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, షరీఫ్, శీనా, కరెంటు ఆది, శ్రీరాములు, శ్రీనివాసులు, మాధవరెడ్డి, మారుతీస్వామి, చెలిమిశివరాం, టీ. అనిల్, వీరయ్య, మాబు, శీనా, ఉస్మాన్, మల్లి పాల్గొన్నారు.

మల్లేపల్లి, శిరిగారిపల్లి గ్రామాల్లో..

ముదిగుబ్బ: మండలంలోని మల్లేపల్లి, శిరిగారిపల్లి గ్రామాలలో టీడీపీశ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి ఆ పథకాల గురించి అవగాహన కల్పించారు. చంద్రబాబు సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు సూర్యశేఖరరాజు, కనుమచంద్ర, కోట్లబాబీ, మహబూబ్‌పీరా, శిరిగారిపల్లి రవి, చలమప్ప, ఐటీడీపీ రాజు, కోనాశేఖర్, గంగమోహన్, వెంకటసుబ్బయ్య, వేణు, చికెన్ తిరుపాల్‌తదితరులు పాల్గొన్నారు.


5వ వార్డులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ శ్రేణులు


ముదిగుబ్బ మండలం శిరిగారిపల్లిలో..

ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్


తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ చంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన సీనియర్ అసిస్టెంట్ బాబాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రజాప్యం చేస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రయోజనాలను పొందటంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 12వ పీఆర్సీ మధ్యంతర భృతి 30శాతం తక్షణమే చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను విడతల వారీగా కాకుండా.. ఒకేసారి చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలను తక్షణమే విడుదల చేయలన్నారు. సీపీఎస్ రద్దుచేసి వారి డీఏల మొత్తాన్ని 90శాతం క్యాష్‌రూపంలో చెల్లించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు. పెన్షనర్ల అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 70నుంచి 75 సంవత్సరాల వయసు మధ్యవారికి 10శాతం, 75నుంచి 80 ఏళ్ల మధ్యవారికి 15శాతం మంజూరు చేయాలన్నారు. టీచర్ల నియామకంలో మళ్లీ ప్రవేశపెట్టిన అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ స్కేల్‌లో నియమించాలన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయిల పెన్షనర్ల అన్నిరకాల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేకపోతే మళ్లీ ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శితోపాటు పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల అధ్యక్షకార్యదర్శులు రాజశేఖర్, జయరాం, ఈశ్వరప్ప, కృష్ణమూర్తి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపల్లిలో తీవ్ర తాగునీటి ఎద్దడి

- బోరుమోటారు వద్ద పైప్‌లైన్ పగిలి వృథా అవుతున్న నీరు
- ట్యాంకుకు సరఫరా కాని వైనం
- వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు


బోరు వద్ద వృథాగా పోతున్న నీరు


పాలంలో నీటి కోసం బిందెలు, బకెట్లను ఉంచిన దృశ్యం

తనకల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో గత 20 రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దాహార్తితో గ్రామస్థులు విలవిల్లాడుతున్నారు. గ్రామానికి తాగునీటి సరఫరా చేసేందుకు బోరు, మోటారు, పైపులైన్‌లు, వాటర్ ట్యాంకు అన్నీ ఉన్నాయి. అయితే ట్యాంకుకు నీటిని సరఫరా చేసేందుకు బోరు వద్ద ఏర్పాటు చేసిన పైపులైన్ పగిలిపోయింది. దీంతో అక్కడ నీరంతా వృథాగా పోతూ ట్యాంకుకు సరఫరా కావడం లేదు. ఫలితంగా గ్రామంలోని కొళాయిలకు నీరు రాక నీటి ఎద్దడి ఏర్పడింది. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ఇక్కడి తాగునీటి పరిస్థితి. గత 20రోజులుగా గ్రామంలో నీరు సరఫరా గాక ప్రజలు పడుతున్న బాధలు వర్ణాణాతీతంగా ఉన్నాయి. చేసేదిలేక తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. సమస్యలను ఇప్పటికే గ్రామపంచాయతీ, సచివాలయ, ఈఓఆర్‌డీ, మండలస్థాయి అధికారులకు చెప్పామని.. ఇంతవరకు పట్టించుకునే వారే లేరని గ్రామస్థులు వాపోతున్నా రు. తాగునీటి బోరు వద్ద పైపులైన్ పగిలిపోయి గ్రామంలోకి నీరు పోకుండా వృథాగా పోతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహిస్తున్నారు. 20రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పగలే విద్యుత్ వెలుగులు

- కె. బ్రాహ్మణపల్లిలో పట్టపగలే వెలుగుతున్న విద్యుత్‌దీపాలు
- పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపమే అంటున్న గ్రామస్థులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 29: కదిరి మండలం కె. బ్రాహ్మణపల్లి గ్రామంలో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందని, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందని స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణను పంచాయతీ సిబ్బందితో పాటు అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. తమ గ్రామంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయని, దీంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోందని తెలుపుతున్నారు. పంచాయతీ సిబ్బంది విద్యుత్‌దీపాలను రాత్రి సమయంలో ఆన్‌చేసి, ఉదయం ఆఫ్ చేయాల్సి ఉందని, కానీ ఇక్కడ అలా జరగడం లేదని, దీంతో గ్రామ పంచాయతీలకు రూ.వేలకు వేలు కరెంటు బిల్లులు వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు పర్యవేక్షణ లేదని, దీంతో సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని అంటున్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చినా, ఎవరూ కూడా గ్రామ సమస్యలపై స్పందించడం లేదని, ప్రతిఒక్కరూ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఈ పరిస్థితి మండలంలోని అన్నిగ్రామాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ దీపాల నిర్వహణపై శ్రద్ధ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కె. బ్రాహ్మణపల్లిలో పగలే వెలుగుతున్న వీధి లైట్లు

తండాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 29: జిల్లాలోని గిరిజన తండాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన బంజారా సేవా సంఘం నుంచి పలు సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ .. తండాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై నివేదిక తయారు చేయాలంటూ ఆదేశించారు. ఎస్‌టీ కుటుంబాలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని, ఎజేఎం పనులు పూర్తి చేసి కొళాయి కనెక్షన్‌లను అందించాలని అన్నారు. ఎస్టీ గ్రాంట్ కింద చేపట్టిన పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. కదిరిలో గిరిజన భవన నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని తెలిపారు. గిరిజన తండాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఆర్డీఓ వెంకటశివసాయిరెడ్డి, హౌసింగ్‌పీడీ వెంకటనారాయణ, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, అఖిల భారత బంజారాసంఘం నాయకులు చక్రినాయక్, బాలేనాయక్, రంగనాథ్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయుడి ఆలయ ప్రారంభోత్సవం

- పాల్గొన్న మాజీ మంత్రి పల్లె


ఆలయానికి విరాళం ఇస్తున్న పల్లె

కొత్తచెరువు, ఫిబ్రవరి 29: మండలంలోని వేములేటిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే వేదమంత్రాల నడుమ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. పురోహితులు, గ్రామస్థులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తర్వాత ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వహణకు పల్లె రూ.50వేలను గ్రామ పెద్దలకు అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, పట్టణ కన్వీనర్ ఒలిపి శీన, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మినారాయణ, కేశప్ప, రమేశ్, గాజులచంద్ర, బండ్లపల్లి రాజు తదితరులు ఉన్నారు.

బాధితుడికి గోనుగుంట్ల ఆర్థికసాయం


బాధితున్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 29: మండలంలోని నేలకోట తండాకు చెందిన దేవలనాయక్ గత బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా పడి అనంతపురంలోని ఆనంద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆస్పత్రికి వెళ్లి అతడిని పరామర్శించారు. వైద్యఖర్చుల కోసం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

ఇనగలూరులో పౌర హక్కుల దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఓబుళదేవర చెరువు, ఫిబ్రవరి 29: మండలంలోని ఇనగలూరులో పౌరహక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖజాబీ, ఎస్‌ఐ వంశీకృష్ణ గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. పౌర హక్కుల గురించి ప్రతిఒక్కరూ ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఆర్‌ఐ నాగేంద్ర, వీఆర్‌ఓ రమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ధర్మవరం, ఫిబ్రవరి 29: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు సూచించారు. స్థానిక యశోద స్కూల్‌లో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు. వీటిని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తిలకించారు. వాటిని ఎలా తయారు చేశారని విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ..మానవాళికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతివిద్యార్థి శాస్త్రవేత్తలుగా ఎదిగి నూతన పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. తర్వాత ఉత్తమమైన నమూనాలను తయారు చేసిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశంలో ముసలం

- అలిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి వర్గీయులు
- పూల శ్రీనివాస్‌రెడ్డి రాకే కారణం..

తనకల్లు, ఫిబ్రవరి 29: మండలకేంద్రం సమీపంలోని మండ్లిపల్లి మిట్ట వద్ద ఉన్న ఎస్ఎంఎన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన వైసీపీ సమావేశంలో ముసలం నెలకొంది. ఈ నెల 3వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించడానికి వైసీపీ నాయకులు ఈ సమావేశం నిర్వహించారు. ఇందుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బుల్ అహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు నాయకులు వజ్రభాస్కర్‌రెడ్డి, పూల శ్రీనివాసరెడ్డి వచ్చారు. కాగా పూల శ్రీనివాసరెడ్డిని సమావేశంలో చూసిన వెంటనే ఎమ్మెల్యే సిద్ధారెడ్డి వర్గీయులు అక్కడి నుంచి జారుకున్నారు. దీంతో ఈ సమావేశంలో ముసలం నెలకొందని పలువురు వైసీపీ నాయకులే చర్చించుకున్నారు. కేవలం పూల శ్రీనివాస్‌రెడ్డి హాజరు కావడంతోనే ఎమ్మెల్యే వర్గీయులు సమావేశం నుంచి వెళ్లిపోయినట్లు బహిరంగ విమర్శలు వ్యక్తమయ్యాయి. గతంలోనే మగ్బుల్‌కు పూల శ్రీనివాసురెడ్డి సమావేశానికి రానవసరం లేదని తనకల్లుకు చెందిన ఎమ్మెల్యే వర్గీయులు చెప్పినట్లు సమాచారం. అయినా మగ్బుల్ ఖాతరు చేయకకుండా పూల శ్రీనివాస్‌రెడ్డిని వెంటబెట్టుకుని రావడంతో ఆగ్రహం చెందిన ఎమ్మెల్యే వర్గీయులు సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిసింది. మంత్రి సమావేశంలో కూడా వారు పాల్గొనరనే సమాచారం ఉంది. ముఖ్యంగా ఎమ్మెల్యే వర్గీయుల్లో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, కొక్కంటి శ్రీనివాసులనాయుడు, దేశాయి శ్రీకంఠరెడ్డి, దుసాని నీలకంఠారెడ్డి, బాలిరెడ్డితోపాటు పలువురు ఉన్నారు. ఎమ్మెల్యే వర్గీయులు అలిగి వెళ్లిపోయినా సమావేశం కొనసాగించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి జయలక్ష్మి

కదిరి లీగల్, ఫిబ్రవరి 29: పట్టణంలోని కోర్టుకు హాజరయ్యే ప్రజల కోసం కోర్టు వద్ద న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి ముఖ్య అతిథి గా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు జలం జీవనాధారమన్నారు. కోర్టుకు హాజరయ్యే ప్రజలకు, కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు దాహార్తి తీర్చుకునేందుకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి, ఏపీపీ లక్ష్మీసాయి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భద్రకాళి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన భద్రకాళి విగ్రహం

లేపాక్షి, ఫిబ్రవరి 29: మండలపరిధిలోని కల్లూరులో వెలసిన వీరభద్రస్వామి దేవస్థానంలో నూతనంగా భద్రకాళి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణ నడుమ నవగ్రహపూజ, కలశస్థాపన, వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

త్వరగా పోలింగ్ బూత్ మరమ్మతులు పూర్తిచేయాలి

సబ్ కలెక్టర్ అపూర్వభరత్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రొద్దం, ఫిబ్రవరి 29: మండలపరిధిలోని చిన్నకోడిపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ మరమ్మతు పనులు నాలుగు రోజుల్లో పూర్తిచేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ విద్యాశాఖ, రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఇది పోలింగ్ కేంద్రమే..' అన్న కథనానికి సబ్ కలెక్టర్ స్పందించి, చిన్నకోడిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి ఏఏ పనులు పూర్తిచేయాలనే విషయంపై వివరించారు. నాలుగు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తిచేసి నివేదికలు అందించాలని రీసర్వే డీటీ చంద్రశేఖర్, ఎంఈఓ జయభాస్కర్‌రెడ్డిలను ఆదేశించారు. ఆయన వెంట వీఆర్‌ఓలు శ్రీదేవి, అనూష, ఎస్‌ఐ వలీబాష, జమేదార్ కాంతప్ప తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు, ఫిబ్రవరి 29: ద్విచక్రవాహనంలో వెళు తూ రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొన్న ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మండలంలోని కోడూరుకు చెందిన బాషు (35) గురువారం హిందూపురం నుంచి తన ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. 544-ఈ జాతీయ రహదారిపై గాద్రాళ్లపల్లి వద్ద రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ని ఢీకొన్నాడు. దీంతో వాహనం బోల్తాపడి కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతిచెందిన వ్యక్తి గుర్తించి అతడి తల్లి ఫాతిమాకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

స్ప్రింక్లర్లు, పైపుల దహనం

రొద్దం, ఫిబ్రవరి 29: మండలపరిధిలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన రైతు పాడెప్ప పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు స్ప్రింక్లర్ పైపులు, గన్నులు, దహనం చేశారని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుండగులు బుధవారం రాత్రి కంచెకు నిప్పంటించి అందులోకి పొలంలో ఉన్న స్ప్రింక్లర్ పైపులు, గన్నులు వేశారని వాపోయాడు. 56స్ప్రింక్లర్ పైపులు, 15గన్నులను దహనం చేయడంతో రూ.40వేలు నష్టపోయానని తెలిపాడు. పొలంవద్దకు గురువారం ఉదయం వెళ్లానని, అప్పటికే దహనం చేశారని, దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వలీబాష తెలిపారు.

రెండువర్గాలపై బైండోవర్ కేసులు

రొద్దం, ఫిబ్రవరి 29 : మండలపరిధిలోని కంచిసముద్రం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న గొడవపై ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆ ఆరు గురిని బైండోవర్ చేశామన్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు పడకుండా ఉండాలని వారిని హెచ్చరించారు. బైండోవర్ పొందిన వారిలో తాడప్ప, నాగన్న, మురళికాగా మరోవర్గానికి చెందిన గోపాల్, మల్లికార్జున, మారుతి ఉన్నారు.

వాహనం బోల్తా - ముగ్గురికి గాయాలు



దెబ్బతిన్న వాహనం

గోరంట్ల, ఫిబ్రవరి 29: మండలంలోని పుట్టపర్తి - బెంగళూరు రహదారిలో చింతలపల్లి క్రాస్ వద్ద బొలేరో బోల్తాపడిన సంఘటనలో ముగ్గురు కూలీలు గురువారం గాయపడ్డారు. మండలంలోని కాలేకుంట్లపల్లి వద్ద కర్ణాటక వాసులు తాము లీజుకు తీసుకున్న భూమిలో బొప్పాయి పంట సాగుచేశారు. పొలంలో పనిచేయడానికి ప్రతిరోజు శీనప్పపల్లి నుంచి కూలీలను ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లేవారు. ఇదే క్రమంలో బొలేరో వాహనంలో ఆరుగురు కూలీలను తీసుకెళ్తున్నారు. చింతపల్లి క్రాస్ వద్ద ముందు చక్రం టైర్ పంక్చర్ కావడంతో వాహనం బోల్తాపడింది. అందులోని విష్ణువర్ధన్, సుశీల, కాలమ్మ తీవ్రంగా గాయపడగా, మిగిలిన కూలీలు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. వారందరిని 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. విష్ణువర్ధన్ తలకు తీవ్రగాయం కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించారు. శాంతమ్మకు చేయి విరిగింది. కాలమ్మకు కుడిచేయి విరగడంతోపాటు తలకు గాయమైంది. దీంతో ఆమెను మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



పెనుకొండ సత్యసాయి కళాశాలలో ఏర్పాటు చేసిన బల్లలు



పెనుకొండ జూనియర్ కళాశాలలో సిబ్బందికి సూచనలిస్తున్న ప్రిన్సిపాల్

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి జరుగనున్నాయి. దీంతో పట్టణంలోని పలు కళాశాలల్లో ఏర్పాటు చేసిన తొమ్మిది పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. కేంద్రాలకు కేటాయించిన విద్యార్థుల సంఖ్యను బట్టి వారి హాల్‌టికెట్ నెంబర్‌లను గదులలో బల్లలపై వేసి ఉంచారు. విద్యార్థుల కు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హిందూపురంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నారాయణ, బాలాజీ, బాలయేసు, సువర్ణభారతి, ఎల్‌ఆర్‌జీ, ఎస్‌డీజీఎస్, ఏపీఆర్‌జేసీ, సప్తగిరి కళాశాలల్లోని కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పెనుకొండ : రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, సత్యసాయి కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. స్థానిక సత్యసాయి కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం జరిగే తెలుగు పరీక్షలకు 212మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. జూనియర్ కళాశాలలో జనరల్ పరీక్షలకు 143, ఒకేషనల్‌కు 161, మొత్తం 304మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం 9నుంచి 12వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు 8.30కు పరీక్ష హాలుకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా బల్లలు, ఫ్యాన్‌లు, విద్యుత్ దీపాలు, మంచినీటి సౌకర్యం, ఫస్టెయిడ్, ప్రథమ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మడకశిరటౌన్: పట్టణంలో ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో మడకశిరలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గం వ్యాప్తంగా 2133 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 1702 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మడకశిర ప్రభుత్వ జూనియర్ కళా శాల, ఒకేషనల్ కళాశాల, సర్వోదయ కళాశాల, వెంకటేశ్వర జూనియర్ కళా శాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 473 మంది, ద్వితీయ సంవతరం 306 మంది, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 316 మంది, ద్వితీయ సంవత్సరం 271 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 282 మంది, ద్వితీయ సంవత్సరంలో 192 మంది, సర్వోదయ కళాశాలలో మొదటి సంవత్సరం 434 మంది, ద్వితీయ సంవత్సరం 301 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.



మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోల్‌నంబర్లు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం సభతో జగన్ ప్యాలెస్ షేక్

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



కోగిర గ్రామస్థులతో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 29 : తాడేపల్లి గూడెంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగసభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఆమె గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి ఎంతో కీలకమన్నారు. అందుకే టీడీపీ, జనసేన పార్టీ చేతులు కలపాల్సి వచ్చిందని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదన్నారు. ఐదుకోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే చంద్రబాబు, పవన్ ఏక మయ్యారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విధ్వంస పాలన సాగిస్తున్నారని, రాష్ట్ర పరిస్థితిని అధోగతి పాల్జేశార ని విమర్శించారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే చంద్రబాబు సూపర్-6 పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని చంద్రబాబు తపిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి ఓటమి తథ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమార్, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు,తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు

పెనుకొండ టౌన్(సోమందేపల్లి) : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం ఆవిష్కరణ పనులు పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్నాయి. విగ్రహాన్ని గురువారం నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో తీసుకొచ్చి ఉంచారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ త్వరలో చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విగ్రహాన్ని ప్రారంభించినున్నట్లు తెలిపారు.

సవితను కలిసిన కోగిర గ్రామస్థులు

రొద్దం: మండలపరిధిలోని కోగిర, కందుకూర్లపల్లికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున తరలి వెళ్లి పెనుకొండలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితను గురవారం కలిశారు. టీడీపీ విజయానికి కృషిచేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. గ్రామాల్లో వైసీపీ పాలనతో చాలా ఇబ్బందులకు గురయ్యామని, గ్రామాల అభివృద్ధికి భవిష్యత్తులో పాటుపడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు టైలర్ ఆంజనేయులు, కార్యకర్తలు, మహిళలు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్



పెనుకొండలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 29: రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాల్సిందే అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇప్పుడు నూతనంగా డీఎస్సీలో ఎంపికైన వారికి అప్రెంటీస్ పెట్టడం ఏంటని ఆగ్రహించారు. దానిని రద్దు చేయాల్సిందే అని పట్టుబట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ రాందాస్ నాయక్, సీనియర్ నాయకులు గురురాజారావు, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పెనుకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లవు తున్నా ఏ ఒక్క సమస్యనుపరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తున్నార న్నారు. తమ సమస్యలను పరిష్కరించనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యుడు కరణం రఘునాథ్‌రావు, జువాజి నాగరాజు, చంద్రశేఖర్‌గౌడ్, వెంకటరమణనాయక్, ఆంజనేయులు, చంద్రశేఖర్, నారప్పరెడ్డి, రుద్రేష్, రంగేష్ కుమార్, శ్రీనివాసు లు, ఆంజనేయులు, శివయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమస్యలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని మండిపడ్డారు. పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నార. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి లతా రామకృష్ణ, నాయకులు యంజారప్ప, నాగరాజు, జయరామరెడ్డి, ప్రశాంత్, సత్యనారాయణ, రామకృష్ణ, రమేష్‌బాబు, రవి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం

గుడిబండ, ఫిబ్రవరి 29 : మండలంలోని మందలపల్లికి చెందిన హనుమంతరాయప్ప అనే వ్యక్తి తన పొలంలో సాగుచేసిన 13 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. వారు అందించిన వివరాల మేరకు... హనుమంతరాయప్ప తన పొలంలో గంజాయి సాగుచేశాడు. అందిన సమాచారం మేరకు పొలంలో తనిఖీచేసి 13 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. గంజాయి మొక్కలు 1650గ్రాములు ఉన్నట్లు వారు తెలిపారు. వ్యవసాయాధికారి వీరనరేష్ పరిశీలించారు. ఈ దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర్ దిరాజ్‌రెడ్డి, వీఆర్‌ఓ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అగళి, ఫిబ్రవరి 29: మండలంలోని పీ బ్యాడిగెర, అగళి, ఇరిగేపల్లి హైవేలో వెళ్తున్న వాహనాలను ఎస్‌ఐ వీరేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్వరలోనే ఎన్నికలు జరుగు తున్న నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టిన ట్లు ఎస్‌ఐ తెలిపారు. అగళి కర్ణాటక సరిహద్దులో ఉన్నందున ఆ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం, గుట్కా తరలించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తామన్నారు.

మణూరులో ప్రబలుతున్న విషజ్వరాలు

ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్న రోగులు



మణూరు గ్రామం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని మణూరు, చత్రం పంచాయతీ గ్రామాల్లో రోజురోజుకు విషజ్వరాలు అధికమవుతున్నాయి. దీంతో చాలా మంది ప్రజలు మంచాన పడుతున్నారు. గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. అదిక్షేత్ర స్థాయిలో కనపడడంలేదని గ్రామీణులు వాపోతున్నారు. మండలంలోని కల్లుమర్రి, కదిరేపల్లి, గుండుమల, నీలకంఠాపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో సరియైన వైద్యసేవలు అందించకపోవడంతో చాలామంది ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామాల్లో సరైన పరిశుభ్రత లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాలబారిన పడుతున్నట్లు వాపోతున్నారు. మండలంలోని మణూరు ఎస్సీ కాలనీలో చాలా మంది విషజ్వరాలు సోకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ క్లినిక్‌లకు పరుగులు తీస్తు న్నారు. అదే విధంగా చత్రం పంచాయతీ గ్రామాల్లో కూడా జ్వరాలు అధికమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కలుమర్రి సూపర్ వైజర్ రాంప్రసాద్‌ను వివరణ కోరగా... మండలంలోని మణూరు ఎస్సీకాలనీ, చత్రం పంచాయతీలో జ్వరాలు అధికంగా సోకుతున్నా యన్నారు. ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సరైన వైద్యసేవలు లేవు



గ్రామాల్లో సరియైన వైద్యసేవలు అందడంలేదు, ప్రభుత్వం మాత్రం ఫ్యామిలీ డాక్టర్లను నియమించాం. వారు గ్రామాలకు వచ్చి వైద్యసేవలు అంది స్తున్నారని చెబుతోంది. అది కేవలం మాటలకే పరిమితం. నాలుగు రోజులుగా నేను తీవ్ర జ్వరంతో బాధప డుతున్నా. కల్లుమర్రి పాథమిక ఆరోగ్య కేంద్రనికి వెళితే తగ్గలేదు. వైద్య పరీక్షలు కూడా చేయలేదు. దీంతో నేను మడకశిర ఆసుపత్రికి వెళ్లా. డెంగీతో బాధపడుతున్నట్లు పరీక్షల అనంతరం గుర్తించినట్లు తెలిపారు. ఎండలు అధికంగా ఉండడంతో గ్రామాల్లో జ్వరాలు కూడా అధికంగా సోకుతున్నట్లు తెలిపారు.

- మంజుల, మణూరు

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం

గోరంట్ల, ఫిబ్రవరి 29: మండలంలోని కే రాగిమేకలపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్థుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్మిక, పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ హరిజవహరలాల్, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు హాజరయ్యారు. రాగిమేకలపల్లిలోని పురాతన ఆలయం శిథిలావస్థకు చేరు కోవడంతో జీర్ణోద్ధరణకు దేవదాయశాఖ ద్వారా రూ.50లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఆలయాన్ని నిర్మించారు. ఆలయం వద్ద రెండురోజులుగా హోమాలు, అభిషేకం, గోపురం కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. డాక్టర్ హరిజవహర్ లాల్ అత్తగారి ఊరు. రాగిమేకలపల్లి. గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆయన హాజరుకా గా ఆయనతోపాటు కలెక్టర్ అరుణ్‌బాబు వచ్చారు. అధికారులను గ్రామస్థులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అక్బల్‌బాషా, సీఐ సుబ్బరాయుడు, స్థానిక ప్రముఖులు గంగాధర్‌రెడ్డి, రాజ శేఖరెడ్డి, సుదర్శన శర్మ, లక్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక శాఖ కార్యదర్శి హరిజవహర్ లాల్, కలెక్టర్ అరుణ్‌బాబును సన్మానించిన గ్రామస్థులు

కోదండరామాలయ నిర్మాణానికి భూమిపూజ

రొద్దం, ఫిబ్రవరి 29 : మండలపరిధిలోని గౌరాజుపల్లిలో కోదండరామాలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. అర్చకులు గిరీష్‌కుమార్ తెల్లవారుజామున భూమిపూజ చేయించారు. ఆలయ జీర్ణోద్ధరణ కోసం గ్రామస్థులు చందాలు వేసుకుని పూజలు చేప ట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశైలం మఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, రాజప్ప, మణీంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశానికి హాజరైన సునీల్‌కుమార్



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 29: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ మడకశిర నియోజకవర్గం అభ్యర్థి సునీల్‌కుమార్, టీడీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు హాజరయ్యారు. ఎన్నికల నియమావళిపై ఆర్‌ఓ పలు సూచనలు చేశారు. పలు అంశాలపై చర్చించారు. ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని ఆయా పార్టీల నాయకులను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదినారాయణ, కిష్టప్ప, సీపీఐ నాయకురాలు పవిత్ర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మారుతీప్రసాద్ తదితరులు ఉన్నారు.

అసమ్మతి నేతల బుజ్జగింపుల్లో...


మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సునీల్‌కుమార్ అసమ్మతి నేతలను బుజ్జగిస్తున్నారు. వారి ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా వారిని కలిసి తన విజయానికి కృషి చేయాలని కోరుతున్నారు. మనందరి లక్ష్యం చంద్రబాబు ను ముఖ్యమంత్రిని చేసుకోవడమేనని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని, అందుకు అందరూ సహకరించాలని కోరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, పలువురు టీడీపీ నేతలు సైతం అసమ్మతి నేతల బుజ్జగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'తల్లిదండ్రులకు మించిన దైవం లేదు'

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 29 : తల్లిదండ్రులకు మించిన దైవం సృష్టిలో లేదని, వృద్ధాప్యం సమయంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు విద్యార్థులకు సూచించారు. మండలపరిధిలోని రాంపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్-3 విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం గురువారం ముగిసింది. ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాలొన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, పీఓ కాంతారావు, హెచ్‌ఎం ఇందిరా, అధ్యాపకులు యశోదరాణి, హరీష్ బాబు, చెన్నారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రంగనాయకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

● పలువురు నాయకుల సంతాపం



ఆదినారాయణరెడ్డి (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 29 : టీడీపీ సీనియర్ నాయకుడు లేపాక్షి మాజీ జడ్పీటీసీ నాయనపల్లి ఆదినారాయణరెడ్డి(68) గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీకి ఎంతో కృషిచేశారు. ఎన్టీఆర్ హయాం నుంచి లేపాక్షి మండలంలో కీలక నాయకుడిగా వ్యవహరించా రు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెం దారు. ఆదినారాయణరెడ్డి 1989 నుంచి 1994వరకు పంచాయతీ సర్పంచ్‌గా, 2014నుంచి 2019వరకు లేపాక్షి జడ్పీటీసీగా పనిచేశారు. వ్యవసాయ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌గా, మండల కన్వీనర్‌గా సేవలందించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ : ఆదినారాయణరెడ్డి మృతిచెందిన విషయం స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఫోన్‌లో పరామర్శించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డాక్టర్ సురేంద్ర, ముఖ్య నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 29 : పెనుకొండ సమీపంలోని మడకశిర పేట్లపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిప్పన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు... మండలపరిధిలోని ఇస్లాపురానికి చెందిన తిప్పన్న పనినిమిత్తం ద్విచక్రవాహనంలో అడదాకులపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మడకశిర పేట్ల వద్ద రాగానే స్పీడ్‌బ్రేకర్ల వద్ద వాహనం బోల్తాపడి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తిప్పన్నకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆటోలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

మార్చి 7న హిందూపురంలో ఉచిత సంతానలేమి పరీక్షా శిబిరం

హిందూపురం: వివాహమై సంవత్సరాలు గడుస్తున్నా సంతాన భాగ్యం దక్కలేదా? అలా అయితే మీకు ఒక సువర్ణావకాశం కల్పిస్తున్నాం. బెంగళూరు నగరానికి చెందిన గుణశీల ఫర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో మార్చి 7న (గురువారం) సంతానలేమి సమస్య ఉన్న దంపతులకు, పదే పదే గర్భస్రావం జరుగుతుంటే, గర్భకోశ సమస్యలు ఉంటే మరియు ఐవీఎఫ్ వైఫల్యాన్ని ఎదుర్కొంటున్న మహిళలు, పురుషుల్లో సంతానహీనత ఉంటే ఉచిత స్కానింగ్, రక్త పరీక్షలు, సంబంధిత ఆరోగ్య సమస్యకు పరీక్షలను హిందూపురంలోని బీఎం మార్కెట్‌లో గల ముబారక్ క్లినిక్‌లో నిర్వహించనున్నారు. ఈ ఉచిత పరీక్షల శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని గుణశీల ఫర్టిలిటీ సెంటర్ సంతాన సాఫల్య నిపుణురాలైన డా. దేవికా గుణశీల తెలిపారు. ఉచిత వైద్య పరీక్షా శిబిరంలో పాల్గొన దలిచే ఆసక్తి గల దంపతులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పేర్లు నమోదు చేసుకునేందుకు 080-46462600 లేదా 8019876526 ఫోన్ నెంబర్లకు సంప్రదించాల్సి ఉంటుంది.